క్లుప్తంగా

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్ : భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని, న్యాయం చేయాలని ఆర్‌యూపీపీ జిల్లా గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి కోరారు. ఈ విషయమై ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డిని పులివెందులలో కలిసి భాషా పండితుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుంచి భాషా పండితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదోన్నతులు, పని చేయడానికి పోస్టులు లేక డీఈఓ పూల్‌నందు ఉన్నారని తెలిపారు. వీరికి సత్వరం పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు రమణయ్య, జిల్లాబాధ్యులు కృష్టారెడ్డి, గంగాధర్‌రెడ్డి, నాగరవీంద్రరెడ్డి, రామగంగిరెడ్డి, శ్రీరాములు, వెంకటేశ్వరరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో బిందె సేవ సందడి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలో సోమవారం బిందె సేవ కార్యక్రమం సందడిగా సాగింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సప్తమితో కూడిన మూల నక్షత్రం ఘడియలు రావడం పవిత్రంగా భావించి బిందె సేవను చేపట్టారు. ఉదయం ఆలయం వద్ద బిందె సేవకులను ఎంపిక చేసి ప్రధాన కలశాన్ని దక్కించుకున్న భక్తులు దాన్ని శిరస్సుపై ఉంచుకుని ఊరేగింపుగా బయలుదేరారు. దీక్షలో ఉన్న మరికొందరు బాలలు, యువకులు ఊరేగింపులో పాల్గొన్నారు. అడుగడుగునా భక్తుల నీరాజనాలు అందుకుంటూ బిందె సేవ ఊరేగింపు సాగింది. కన్యకాంబ స్తుతిని గురించి రాసి ఉన్న ఎర్రని పతాకాలను చేతబూని భక్తులు జై వాసవాంబ అంటూ నినాదాలు చేస్తూ సాగారు.

నూతన కమిటీ ఎన్నిక




నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు పి.సంపత్, ప్రధాన కార్యదర్శి చైతల్య

కడప కార్పొరేషన్ : జై భీమ్ మాల మహాసేన నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి చైతల్య తెలిపారు. సోమవారం కడప నగరంలోని జై భీమ్ మాల మహాసేన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వీరి ఎన్నిక జరిగిందన్నారు. జిల్లా గౌరవ సలహా దారులుగా జ్ఞాన ప్రకాశం, కొమ్మలపాటి దివాకర్, ఉపాధ్యక్షులుగా దియ్యాల లారెన్స్, రత్నకుమారి, ప్రధాన కార్యదర్శిగా వై.శేఖర్, బండెల రవిశంకర్, కార్యదర్శులుగా వసంత్, రాజామణి లను ఎన్నికయ్యారన్నారు. వారితోపాటు చెన్నూరు మండలం అధ్యక్షులుగా ఉదయ్, పొద్దుటూరు మండల అధ్యక్షులుగా ప్రసన్నకుమార్‌తో పాటు మీడియా ఇన్‌చార్జులుగా ఇరగయ్య, చంద్ర విలియమ్స్, జార్జ్, మల్లూరు జాషువా లను ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మాలల సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు.

అధిక బస్సు ఛార్జీల వసూలుపై ఫిర్యాదు

కడప సెవెన్‌రోడ్స్ : దసరా పండుగను ఆసరాగా తీసుకుని ప్రజల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ సోమవారం కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. అధిక రేట్లతో నిలువుదోపిడీ చేస్తున్నారన్నారు. సాధారణ రోజుల్లో ఒక ధర, పండుగ రోజుల్లో డిమాండును బట్టి టిక్కెట్ రేట్లు అమాంతంగా పెంచేస్తున్నారని పేర్కొన్నారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాదు, విజయవాడలకు జిల్లాలో రూ.2000–5000 వేల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అంత డబ్బులు పెట్టి సొంతూర్లకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లకు బదులు ఒకరితోనే నడిపిస్తున్నారని, ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనన్నారు. రవాణా అధికారులు రెగ్యులర్ తనిఖీలు నిర్వహించి అధిక ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

కమలాపురం : పలు కేసుల్లో జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప బాబాఫక్రుద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన కమలాపురం సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను విజిట్ చేసి రిజిష్టర్లను పరిశీలించారు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఖైదీల ఆరోగ్యం పై సబ్ జైలు సూపరింటెండెంట్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సిబ్బంది, న్యాయ వాదులు, పారా లీగల్ వాలంటరీలు పాల్గొన్నారు.

చదువుల తల్లీ.. వందనం



బాలపోలేరమ్మను దర్శించుకుంటున్న భక్తులు



శ్రీ సరస్వతీమాతగా బాలపోలేరమ్మ తల్లి



శ్రీ సరస్వతీదేవిగా లలితాంబిక అమ్మవారు



నడివీధి గంగమ్మను దర్శించుకుంటున్నభక్తులు



శ్రీ సరస్వతీదేవిగా నడివీధి గంగమ్మ తల్లి



శ్రీ సరస్వతీమాతగా కామకోటి కళాంబదేవి



తిరుచ్చివాహనంలో కడప రాయుడు



గడ్డిబజారులోశ్రీ నరసింహస్వామి అలంకారంలో సత్యదేవుడు



భావనారుషి ఆలయంలో అమ్మవారికి శ్రీ సరస్వతీమాత అలంకారం

కడప సెవెన్‌రోడ్స్ : దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం కడప నగరంలోని దేవీ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉత్సవాల్లో భాగంగా కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి తిరుచ్చి వాహనంలో భక్తులను కరుణించారు. దేవునికడప మాడవీధుల్లో ఊరేగింపుగా వచ్చిన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెద్ద బెస్తవీధిలోని శ్రీ బాల పోలేరమ్మ ఆలయంలో అమ్మవార్లను వీణాపాణిగా ఉన్న శ్రీ సరస్వతిమాతగా అలంకరించారు. గడ్డిబజారు శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో శ్రీ నరసింహాస్వామి అలంకారంలో స్వామిని కొలువుదీర్చారు. శ్రీ కామకోటి కళాంబదేవిని శ్రీ సరస్వతీమాతగా అలంకరించారు. నడివీధి గంగమ్మను శ్రీ సరస్వతీదేవిగా, భావనారుషి ఆలయంలో అమ్మవారిని శ్రీ సరస్వతీమాతగా, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని సరస్వతిమాతగా, శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో శ్రీ గౌరీదేవిగా, నగర శివార్లలోని లలితాంబిక ఆలయంలో శ్రీ సరస్వతీదేవిగా, నాగరాజుపేటలోని శ్రీ రాజరాజశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని శ్రీ సరస్వతీమాతగా అలంకరించారు.



సురేష్‌బాబును సత్కరిస్తున్న దుర్గాప్రసాద్

ఎయిడెడ్ పోస్టుల కేసు విజిలెన్స్‌కు అప్పగించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఆర్‌సీఎం ఎయిడెడ్ పోస్టుల భర్తీలో చోటుచేసుకున్న అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు కేసును విజిలెన్స్‌కు అప్పగించాలని వివిధ సంఘాల నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఆర్ఎస్ రాజ, డీఎం ఓబులేశు యాదవ్, వీరనాల శివకుమార్, అంకన్నలు మాట్లాడుతూ ఆర్‌జేడీ శ్యామూల్ ప్రైవేటు యాజమాన్యాలతో కుమ్మక్కైన ఫలితంగానే టీచర్ పోస్టుల భర్తీలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫైలు డీఈఓకు పంపిస్తున్నారని తెలిపారు. డీఈఓ తన పై అధికారులపై విచారణ ఎలా చేపట్టగలరని ప్రశ్నించారు. ఇందులో నిజాలు వెలుగులోకి వచ్చి బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు వీలుగా కేసు విజిలెన్స్‌కు అప్పగించాలని కోరారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం సమర్పించారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

కడప కార్పొరేషన్ : విజయదశమి పండుగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు కొత్త దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల సమయాల్లో పారిశుధ్య కార్మికులకు బట్టలు పెట్టడం మంచి సాంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాక సురేష్ కుమార్, పులి సునీల్, ఎస్. వెంకటేశ్వర్లు, త్యాగరాజు, షఫీ, సుబ్బరాయుడు, కంచుపాటి బాబు, ఫయాజ్ పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ను ఆ పార్టీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. స్థానిక నాగరాజుపేటలో సౌత్‌జోన్ అధ్యక్షులు ఐస్‌క్రీం రవి కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దొంగ కేసులు అక్రమ కేసులు బనాయించి జైలు పాలు చేస్తున్నారన్నారు. వారికి భరోసా కల్పించడానికి పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ డిజిటల్ బుక్‌ను రూపొందించారన్నారు. ఈ ప్రభుత్వం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ఈ డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి తమకు జరిగిన అన్యాయాన్ని నమోదు చేసుకోవచ్చన్నారు. అక్రమ కేసులకు ఎవరూ భయపడవద్దని, పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామ్ లక్ష్మణ్ రెడ్డి, కే బాబు, పార్టీ నాయకులు శ్రీరంజన్ రెడ్డి, సుబ్బరాయుడు, రామక్రిష్టారెడ్డి రామచంద్రయ్య, అజ్మతుల్లా, బసవ రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేయూపి రాష్ట్ర అధ్యక్షుడు డా.గునిశెట్టి శ్రీనివాసులు

'పుట్టా' అలా మాట్లాడడం చేతగానితనం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాజోలి రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు రాబట్టడంలో అధినాయకత్వాన్ని ఒప్పించడంలో చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అలగనూరు ద్వారా ఆరుతడి పంటలకు నీళ్ల అందిస్తామని అసెంబ్లీలో మాట్లాడడం విచారకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2025 జనవరి 18న మైదుకూరులో ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు రాజోలు నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని, చివరి ఆయకట్టు స్థిరీకరిస్తానని గొప్పగా ప్రకటించి పోయిన రెండు నెలలకు ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేటాయింపులలో రాజోలికి తీవ్రమైన అన్యాయం చేశారన్నారు. రాజోలు నిర్మాణానికి నిధులు రాబట్టేందుకు అధినాయకత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన పుట్టా సుధాకర్ రాజోలు నిర్మాణానికి నిధుల భారం ఎక్కువ కాబట్టి అలగనూరు ప్రాజెక్టుకు పడ్డ గండ్లు పూడ్చేందుకు నిధులు కేటాయిస్తే చాలు అని అసెంబ్లీ వర్షాకాల సమావేశాలలో మాట్లాడడం పుట్టా సుధాకర్ చేతగానితనానికి నిదర్శనం అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసు బాదుల్లా రైతు సంఘం నాయకులు ఎం కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

స్వర్ణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రొద్దుటూరు : స్వర్ణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో బంగారు షాపుల్లో సుమారు 5 వేల మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. బంగారం ధరలు పెరగడం వల్ల కార్మికులకు పని లేకుండా పోయిందని పేర్కొన్నారు. కార్మికులు కుటుంబాలను పోషించుకోవడానికి అప్పులు చేయాల్సి వస్తోందని వాపోయారు. గతంలో చేనేత పనులు లేక బంగారు పనుల్లోకి వచ్చి పనులు చేసుకుంటున్నారన్నారు. ఇప్పుడు ఆ పనులు కూడా కోల్పోయారని, ప్రభుత్వం బంగారు పని చేసే కార్మికులను గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఏరియా కార్యదర్శి శేఖర్, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

సీఐ రామకృష్ణ వీఆర్‌కు బదిలీ

కడప అర్బన్ : కడప నగరం వన్ టౌన్ సీఐగా పని చేస్తున్న బి.రామకృష్ణను వీఆర్‌కు బదిలీ చేస్తూ సోమవారం ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది సెప్టెంబర్‌లో రామకృష్ణ బాధ్యతలను స్వీకరించారు. పరిపాలనా సంబంధిత వ్యవహారాలతో బదిలీ చేసినట్లు ఎస్పీ ధృవీకరించారు.

అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న వన్‌గ్రాస్ప్ ప్రతినిధి

కడప ఎడ్యుకేషన్ : వన్‌గ్రాస్ప్‌తో మహిళలకు ఎంతో ఉపయుక్తం అని వన్‌గ్రాస్ప్ సీఈఓ సుచిత్ర పేర్కొన్నారు. సోమవారం కడప శాంతినికేతన్ పాఠశాల సమీపంలో వన్‌గ్రాస్ప్ మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా మహిళల అభ్యున్నతి కెరియర్ అవకాశాలపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ మార్పు కోరుకునే మహిళలకు, ఇంటి వద్ద నుంచే చదువుకోవాలనుకునే వృత్తి నిపుణులకు, కెరీర్ దిశ కోసం వెతుకుతున్న విద్యార్థులకు, అంతర్జాతీయ చదువులపై కలలు కనే వారికి, కొత్త వ్యాపారాలు మొదలు పెట్టదలచిన వారికి ఉపయోగపడేలా ఈ కార్యక్రమం రూపొందించామన్నారు. కరుణ వన్‌గ్రాస్ప్ కెరీర్ కౌన్సిలింగ్ ప్రోగ్రాంను పరిచయం చేశారు. శిల్ప వన్‌గ్రాస్ప్ అందిస్తున్న ఆన్‌లైన్ క్యాంపస్, విదేశీ విద్యా అవకాశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ స్కూల్ కరస్పాండెంట్ ఎలియాస్ రెడ్డి, వన్‌గ్రాస్ప్ ప్రతినిధులు సునీత, శిల్ప, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన కుర్రాళ్లు



సూఫియాన్



లక్ష్మన్న

కమలాపురం : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కమలాపురంకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పట్టణంలోని దర్గా వీధికి చెందిన షేక్ మహ్మద్ సూఫియాన్ గుంటూరులో ఈనెల 27 నుంచి గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ క్రీడా మైదానంలో జరిగిన కిడ్స్ జావెలిన్ త్రో విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కమలాపురంలోని పీఎంఎస్ఆర్ఎం జూనియర్ కళాశాలకు చెందిన సెకండియర్ విద్యార్థి లక్ష్మన్న అండర్–19 అథ్లెటిక్స్ 5కే వాక్ రేస్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

సమ్మెలోకి పీహెచ్‌సీ వైద్యులు

చింతకొమ్మదిన్నె : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యులు అందుబాటులో లేకపోవడంతో జూనియర్ వైద్యులు (ట్రైనీ), నర్సులు మిగతా సిబ్బంది వైద్య సేవలు అందించారు. మహిళా వైద్యులు ఒకరు సెలవులో ఉండగా, మరో వైద్యుడు రాఘవేంద్ర ఆసుపత్రిలో లేకపోవడంతో ఫోన్ ద్వారా సమాచారం కోరగా తాను సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగా వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేడు వీఎన్‌పల్లెకు నరేన్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి మంగళవారం వీరపునాయునిపల్లెకు రానున్నట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. పార్టీ కార్యాలయంలో ఆయన డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ విడుదల చేస్తారన్నారు.

నగరంలో వంకలు, కాల్వల కబ్జాలను అరికట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో కొంత మంది వ్యక్తులు వంకలు, కాల్వలను కబ్జా చేస్తున్నారని, తక్షణమే అలాంటి వాటిని అరికట్టాలని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో అనేక ప్రాంతాల్లో వంకలను, కాలువలను ఆక్రమించి కబ్జా చేస్తున్నారని అన్నారు. గతంలో రామాంజనేయ పురంలోని యానాది కాలనీ ప్రాంతంలో రెవెన్యూ అధికారులే కాలువ పక్కన ఉన్న ఇండ్లను కూల్చివేసి వంక వెడల్పు చేశారన్నారు. అప్పుడు అనేక మంది పేదలు ఇల్లు కోల్పోయారని తెలిపారు. కానీ ప్రస్తుతం అదే ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు ఆ వంక కాలువ ఉన్న ప్రాంతాన్ని ఆక్రమించి ఇతరులకు అమ్మకాలు పెట్టారన్నారు. దీని కారణంగా అక్కడున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎఫ్ క్వార్టర్స్ వద్ద ఉన్న కాలువను యధాతధంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి, రామకష్టారెడ్డి, పార్టీ నాయకుడు శివకుమార్ పాల్గొన్నారు.



తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

డీఎస్సీకి ముందే అంతర జిల్లా బదిలీలు చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్ : మెగా డీఎస్సీకి ముందే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల అంతరజిల్లా బదిలీలు చేపట్టాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కడపలోని ఆర్జేయూపి భుజంగరావు స్మారక టీచర్స్ భవన్‌లో సోమవారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథి హాజరైన ఆర్‌జేయూపీ అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు డా.గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ డీఎస్సీ వారికి స్థానాలను కేటాయించక మునుపే అంతర్‌జిల్లా బదిలీలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.యం. షరీఫ్, కడప జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు, టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, సీనియర్ నాయకులు వీరయ్య, ఆంజనేయులు, రాముడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేయూపి రాష్ట్ర అధ్యక్షుడు డా.గునిశెట్టి శ్రీనివాసులు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు బారికేడ్ల ఏర్పాటు

కడప అర్బన్ : కడప నగరంలోని ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సమీపంలో సోమవారం బారికేడ్లు ఏర్పాటు చేశారు. కడప ట్రాఫిక్ సీఐ జావీద్ ఆధ్వర్యంలో ఎస్ఐ జయరాములు, సిబ్బందితో కలిసి నిత్యం ఇక్కడ వాహనాల రద్దీ ఎక్కువ ఉండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేది. దీనికి తోడు తోపుడు పండ్లు రోడ్డుకు అడ్డంగా ఉండేవి. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రత తగ్గించేందుకు పాత బస్టాండ్ నుంచి సెవెన్ రోడ్స్ వరకు రోడ్డు మధ్యలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఏ వాహనం ఎటు వెళ్లాలో అటు వెళ్తుంది. ట్రాఫిక్ సమస్య తీరిపోతుంది.



కడప నగరంలోని పాతబస్టాండ్ నుంచి సెవెన్‌రోడ్స్ వరకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

అధికార భాష హిందీని ఆదరించాలి

కడప ఎడ్యుకేషన్ : అధికార భాష హిందీని ఆదిరించి మన సంస్థ కార్యకలాపాల్లో వినియోగించుకోవాలని రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. కడపలోని పీఎఫ్ కార్యాలయంలో సోమవారం హిందీ పక్షోత్సవాల ముగింపు సమావేశాన్ని నిర్వహించి బహుమతి ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ హిందీ రాజ భాష అని, దీనిని అందరం ఆదరించాలన్నారు. పీఎఫ్ ఆఫీస్ అసిస్టెంట్ డైరెక్టర్(హిందీ) షేక్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ హిందీభాష నేర్చుకోవడం ద్వారా సులభంగా ఉపాధి అవకాశాలను పొందవచ్చన్నారు. ఎగువపల్లి హిందీ స్కూల్ అసిస్టెంట్ మహబూబ్‌బాషా, అసిస్టెంట్ పీఎఫ్ కమీషనర్ హిందీభాష ఔన్నత్యాన్ని వివరించారు. అనంతరం హిందీభాషలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బందితోపాటు భాషాభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రొద్దుటూరు : ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మస్టర్ పాయింట్ల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మాన్ మాట్లాడుతూ అనంతపురంలో ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులపై అక్రమ కేసు పెట్టి డ్యూటీ నుంచి తొలగించాలని అధికారులు నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు పద్మజను జనసేన కార్పొరేట్ దూషించడం, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని బెదిరించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కొన్ని మున్సిపాలిటీల్లో అధికారులు తీరు మారలేదని విమర్శించారు. కార్పొరేట్‌పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.